# కలియుగ భస్మాసురుడు

వక్కలంక రామారావు

"నేను సినిమా చూస్తాను" అన్నాడు దివాకరరావు.

"ఏవిటీ? నువ్వు సినిమా తీస్తావా? అది నీవల్ల అయ్యే పనేనా?" పకపక నవ్వుతూ క్వశ్చన్‌మార్కులా మెలితిరిగిపోయి, ఎలాగ నిలదొక్కుకుని ఆశ్చర్యం మార్కులా అయిపోయి చిట్టచివరకు ఎలాగో నిట్టనిలువుగా నిలబడగలిగాడు నిరంజనరావు.

"నీ కీ మధ్య చెవుడు కూడా పట్టుకుం దేమిటీ? సినిమా చూస్తా నన్నాను, తీస్తానన్లేదు." జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి, ఉన్న ఒకే ఒక్క సిగరెట్టూ వెలిగించి, పెట్టె అవతల పారేస్తూ అన్నాడు దివాకరరావు.

"చూస్తే చూడు. నాతో చెప్పడం దేనికి?"

"సినిమా టికెట్టు మూడున్నర. నా దగ్గర అర్ధరూపాయి తక్కువగా ఉంది."

"ఓ అదా సంగతి ! అర్ధరూపాయి కావాలిస్తే నే ఇస్తాన్లే. కాని చూడు దివాకరం ఒక్క విషయం. నీకు యూనివర్సిటీ వాళ్ళిచ్చిన డిగ్రీ ఉంది. తెలివితేటలతో నిండిన తాటికాయంత తలకాయ ఉంది. అయినా పావలాకీ అర్ధరూపాయికీ మరొకళ్ళ ముందు ఇలా చెయ్యి చాపటం మాత్రం ఏమీ బాగుండలేదు. నన్ను డబ్బు లడిగావు గదా అని నిన్ను తక్కువ చేసి నే నిలా అనటంలేదు. మగాడన్నాక ఏదోలాగు నాలుగు డబ్బులు సంపాదించటం నేర్చుకోవాలి. ఇంతవరకూ నువ్వు బ్రహ్మచారివి కనుక రోజు లెలాగో దొర్లించుకు వస్తున్నావ్. రేపు పెళ్ళయి ఇద్దరు పిల్లలు పుడితే వాళ్ళను పోషించటం ఎలాగో కాస్తంత ఆలోచించు." కృష్ణపరమాత్మ పోజులో గీత బోధించాడు నిరంజనరావు.

"తన కో దారి లేదు మెడ కో డోలన్నట్లు నాకు పెళ్ళీ, పిల్లలూ కూడానా? ఏదో నెల కో నాలుగు కథలు రాసి ఆ పత్రికల వాళ్ళిచ్చిన పారితోషికంతో ఎలాగో ఓ పూట తిని, మరో పూట తినక కాలం నెట్టుకొస్తున్నాను. ఉద్యోగానికా వయస్సు దాటిపోయింది. మరేం చెయ్యమంటావ్?"

"ఏమీ చేతకాదని చేతులు ముడుచుకు కూర్చుంటే నిజంగానే ఏమీ చెయ్యలేవు. అసలంటూ డబ్బు సంపాదించాలనే ఊహ ఉండాలే గాని అందుకు శతకోటి మార్గా లున్నాయి."

"ఏది బాబూ ! ఆ శతకోటి మార్గాల్లో నాకు సెంట్ పర్సెంట్ సూటయ్యే ఒకే ఒక్క మార్గం చెప్పు చాలు. అదే నా పాలిట పదివేలు."

"నువ్వు సినిమా చూస్తానంటే నా చెవులకు అది సినిమా తీస్తా నన్నట్లుగా వినబడింది. నిజానికి సినిమా చూట్టానికే పైసలు లేని నువ్వు సినిమా తీస్తానంటే అంతకంటే పెద్ద జోకు మరేంలేదు. కాని ఈ జోకులోంచే నా కో మహత్తరమైన ఐడియా వచ్చింది. నువ్వు ఎలాగూ సినిమా తియ్యలేవు. కాని కథలు రాయటం వచ్చిన నీకు, సినిమాలు తరుచుగా చూసే నీకు ఓ తెలుగు సినిమాకి కథ రాయటం ఏమంత కష్టం కాదు. ఈ రోజే నీ బుర్ర ఉపయోగించి ఓ మంచి సినిమా కథ రాయి. ఆ కథను ఓ డబ్బున్న సినిమా పిచ్చాడికి చూపించు. 'గురువుగారూ, ఈ కథను గనక తమరు సినిమాగా తీస్తే లక్షణంగా లక్షలు సంపాదించొచ్చునని గాలి కొట్టు. ఒక శ్ళిద్దరు భయపడి కాదన్నా ఆ బాపతుపక్షుల్లో ఏదో ఒక పక్షి నీ వలలో చిక్కకపోదు. ఆ పక్షినుంచి నీ కథకు పారితోషికంగా ఓ పది వేలు ముందుగానే రాబట్టుకో. అటుపైన ఆ పక్షిని పదిలంగా పంజరంలో పెట్టి మద్రాసో, హైదరాబాదో తీసుకెళ్ళు. ఆపైన నేర్పుగా మిగతా కథ నడిపించి ఏదోలాగు వాడిచేత ఓ పాతిక లక్షలు ఖర్చు పెట్టించి ఓ బొమ్మ తీయించు. ఒకవేళ నీ నుడి బాగుండి ఆ బొమ్మ సక్సెస్ అయ్యిందా, ఆ ప్రతిభ అంతా నీదేనని డబ్బా కొట్టు. దాంతో మాంచి సినీ కథకుడిగా నీకు ఫీల్డులో పేరొస్తుంది. నీ కథల కోసం అటుపైన ప్రొడ్యూసర్లు రెండు రూపాయల బియ్యం కోసం ఆకుపచ్చ కార్డుల వాళ్ళు క్యూలో నిలబడ్డట్లుగా నిలబడతారు. అలా అలా ఎదిగి ఎదిగి ఆ ఫీల్డులో స్థిరపడిపో. ఇక రెండవ పక్షంలో - అంటే ఆ సినిమా మొదటి వారంలోనే డబ్బాలు తిరిగొచ్చి, ప్రొడ్యూసరుగారు డబ్బులు పోయి దిబ్బైపోయిననాడు - ఆయనను కూడా నీ సొంత బ్రదర్‌గా భావించి, సానుభూతితో నీ హృదయానికి హత్తుకో. అటుపైన ఇద్దరూ కలసి బ్రతకటానికి మరో కొత్త మార్గం ఆలోచించొచ్చు."

"కథకేం లేరా ! అది పెద్ద సమస్య కాదు. ఈజీగా రాయొచ్చు. కాని మన కథ చూసి సినిమా తీస్తానంటూ భూమీ, పుట్రా అమ్మి, డబ్బు కట్టలు బ్రీఫ్‌కేసులో పెట్టుకుని నాతోపాటు హైదరాబాదు రైలెక్కే అమాయక చక్రవర్తులు నిజంగా ఉన్నా రంటావా?"

"లేకేంరా ? అదంతా నీ మాటల చాకచక్యంల ఉంది. ఎదుటివాణ్ణి ఎలాగోలాగు బుట్టలో పెట్టడం చేతవ్వాలి. వాడికి అరచేతిలో స్వర్గం చూపించాలి ధనలక్ష్మి నిజంగా వాడి కాళ్ళముందు నృత్యం చేస్తున్న భావం కలిగించాలి. మాటల గారడీ చేసి వాణ్ణి గుప్పిట్లో ఇరికించుకోవాలి. ఇదంతా ఒకరు చెపితే వచ్చేది కాదు. ఇది నిజంగా ఒక కళ. ఆ

## వ్యాయామం-క్రీడలు



23 మార్చి, 1924వ తేదీ జన్మించిన శ్రీ ఎమ్. జె. రామమూర్తి హాకీ, టెన్నిస్, క్రికెట్ క్రీడలలో మంచి పేరు సంపాదించారు. మద్రాసులో విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లో ప్రెసిడెన్సీ కళాశాల, మద్రాసు విశ్వవిద్యాలయ హాకీ జట్ల ఆటగాడుగా పేరు సంపాదించారు. తరువాత టెన్నిస్ క్రీడలో ప్రవేశించి రాయలసీమలోనూ, ఇంకా అనేక ప్రాంతాల్లోనూ జరిగిన టెన్నిస్ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించారు. ఆవిధంగానే క్రికెట్ క్రీడను కూడా చేబట్టి 1954 - 55, 55 - 56 సంవత్సరాలు ఆంధ్రా క్రికెట్ జట్టులో ఎన్నికై రంజీ ట్రోఫీ పోటీల్లో పాల్గొన్నారు. కొంతకాలం రాష్ట్ర క్రీడామండలి సభ్యుడుగా కూడా ఉండి క్రీడా రంగానికి సేవ చేశారు. ఈనాటికీ టెన్నిస్ క్రీడను వదిలిపెట్టకుండా, విరామం దొరికినప్పుడు బిలియర్డ్స్ ఆడుతూ, కర్నూలులో న్యాయవాద వృత్తిని నిర్వహిస్తున్నారు.

ఏకా




కళలో ప్రావీణ్యం ఉంటే సాధించలేనిది లేదు."

'దివాకరరావు కళ్ళకి కోరిన వరాలిచ్చే శంకరునిలా కనిపించాడు నిరంజనరావు ఆ క్షణంలో.

"నరే నీ మాట ప్రకారం ఓ మాంచి సినిమా కథ రాసి, అటుపైన నిర్మాత కోసం ట్రై చేస్తాను. ముందు అర్థరూపాయి ఇలా పడెయ్. సినిమాకు టైమవుతూంది."

డబ్బు లిచ్చి దివాకరరావుని సాగనంపి, దివాకరరావుకు అంతటి దివ్యమైన సలహా

ఇవ్వగలిగినందుకు తనను తనే, అభినందించుకున్నాడు నిరంజనరావు.

** ** **

దివాకరరావు, నిరంజనరావు దిబ్బలపాడు ఎలిమెంటరీ స్కూల్లో అయిదేళ్ళ పాటు కలసి చదువుకున్నారు. అటుపైన దిబ్బలపాడుకు అయిదు మైళ్ళ దూరంలో ఉన్న అప్పడాలపల్లిలో మరో అయిదేళ్ళు హైస్కూలు చదువు వెలిగించారు. టెంత్ క్లాసు రిజల్ట్సు వచ్చాయి. దివాకరరావు ఫస్టు క్లాసులో పాసయ్యాడు. నిరంజనరావు నంబరు ఏ పేపరువాళ్ళూ వెయ్యలేదు. అది కేవలం అచ్చు పొరపాటని, మార్కులు వచ్చేదాకా వేచి చూడాలని అమ్మా నాన్నలను ఓపికగా ఓదార్చాడు నిరంజనరావు. తీరా మార్కులు వచ్చాక కూడా పరీక్ష పోయినట్లే నిర్ధారణ అయ్యింది. పేపర్లు దిద్దేవాళ్ళు అలక్ష్యాన్ని కంప్యూటర్లు చేసే తప్పులని అమ్మా నాన్నల ముందు వరసగా, ఏకధాటిగా ఏకరువుపెట్టి అంతటితో చదువు చాలించాడు నిరంజనరావు.

నిరంజనరావుకు చదువు అంతగా లేకపోయినా దిబ్బలపాడులో లంకంత మండువా లోగిలి, పదహా రెకరాల మాగాణీ, పన్నెం డెకరాల కొబ్బరి తోట, అయి దెకరాల ముప్పై సెంట్ల మెట్టభూమి ఉన్నాయి.

ఒక్కగా నొక్క కొడుకు ఇక చదవనని మొండికేయటంతో వాడు ఇంకా పై చదువులు చదివితే మాత్రం ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళేలాలా అనే పాత సామెతను మరోసారి మననం చేసుకుని అంతటితో ఊరుకున్నారు తల్లితండ్రులు.

తరువాత నిరంజనరావుకి పిల్ల నిస్తామంటూ పల్లెల నుంచీ, పట్నాల నుంచీ ఆడపిల్లల తండ్రులు రోజూ కొకరు చొప్పున సొంత కార్లమీద, టాక్సీలమీద, గుర్రబ్బళ్ళమీద, మో పెడ్లమీద, స్కూటర్లమీద దిబ్బలపాడు రావటం ప్రారంభించారు. చివరకు నిరంజనరావుకు, అతగాడి తండ్రికి వెంకటాయపాలెం వారి సంబంధం సర్వవిధాలా నచ్చింది. పదెకరాల మాగాణీ, లక్ష రూపాయల కట్నంతో పాటు లక్ష విలువచేసే బంగారు ఆభరణాలు ధరించి వెంకటలక్ష్మి నిరంజనరావు భార్యగా దిబ్బలపాడులో అడుగు పెట్టింది. నిరంజనరావుకి పెళ్ళయిన మరు సంవత్సరమే ఆస్తినంతా తమ ఒక్కగానొక్క కొడుక్కి అప్పచెప్పి అర్జెంటుగా స్వర్గం వెళ్ళిపోయి, సావిట్లో తమ ఫోటోలకు దండలు వేయించుకుని గోడకు అతుక్కుపోయారు అమ్మా, నాన్నా.

ప్రస్తుతం నిరంజనరావు పగలు వ్యవసాయం చేస్తూ, రాత్రులు వెంకటలక్ష్మితో కాపురం చేస్తూ, ఉదయమూ, సాయంకాలమూ అడిగిన వారికీ అడగని వారికీ, అయినవాళ్ళకీ, కానివాళ్ళకీ ఉచిత సలహాలిస్తూ దిబ్బలపాడులోనే సెటిలైపోయాడు.

** ** **

దివాకరరావు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉండగానే వాళ్ళ ఫాదరూ, మదరూ మన తెలుగు సినిమాలు నచ్చక, స్వర్గంలో ఏదో మంచి సినిమా ఆడుతూందని చెప్పాపెట్టకుండా నాలుగు రోజుల తేడాలో ఇద్దరూ వెళ్ళిపోయారు.

"మంచి సినిమా చూట్టానికి స్వర్గానికే వెళ్ళాలా? మీ రంతగా చూడాలనుకుంటే మన భూలోకంలో మాత్రం మంచి సినిమాలు లేవూ? మనకు డబ్బు లేదని మీరు బాధపడటం నాకు తెలుసు. నిజంగా మీరు సినిమాయే చూడాలంటే నేను రిక్షా తొక్కో, ఇటుకలు మోసో ఎలాగోలాగు డబ్బు సంపాదించి మీ కోరిక తీర్చేవాణ్ణి. ఎంతమంది సినిమా హీరోలు రిక్షాలు తొక్కి, సైకిలు పందెం గెలిచి తమ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేయటంలేదు ! ఎంతమంది సినిమా హీరోలు పగలు ఇటుకలు మోసి, రాత్రి నైట్ కాలేజీలో చదివి రెండేళ్ళయినా కాకముందే సొంత కారుల్లో తిరుగుతూ, మేడల్లో, ఏసీ రూముల్లో పడుకోవటంలేదు ! అన్నీ తెలిసి న న్నెందుకిలా అన్యాయం చేశావు ఫాదరూ ! ను వ్వెందుకిలా చేశావు మదరూ !" అంటూ అయిదారు రోజులు అదేపనిగా ఏడ్చి అటుపైన అలసిపోయి, ఇక ఏడవలేక అంతటితో ఊరుకున్నాడు దివాకరరావు.

అమ్మా, నాన్నా ఇచ్చిన ఆస్తిపాస్తులు ఏమీ లేకపోవటంతో ఎలాగో ఓ అద్దె రిక్షా సంపాదించి రాత్రులు సినిమా బేరాలు చూసుకుంటూ, పగలు కాలేజీలో చదివి ఎలాగో డిగ్రీ సంపాదించి, అటుపైన ఉద్యోగం సంపాదించటం చేతకాక దిబ్బలపాడు వచ్చేశాడు దివాకరరావు. అమ్మా, నాన్నా మిగిల్చిపోయిన ఇల్లు పాతబడిపోయినా, ఇల్లు నేయించటానికి డబ్బు లేక వర్షం కురవని గదిలో వంట చేసుకుంటూ, ఎండ పడనిచోటు తుంగచాప పరచుకొని పడుకుంటూ, కథలు రాసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు దివాకరరావు.

** ** **

సినిమా థియేటరు దగ్గరికి దివాకరరావు చేరేసరికి ఇంకా బయట రికార్డులు వేస్తున్నారు. మూడున్నర ఇచ్చి టికెట్టు దేనికని అరపెట్టె సిగరెట్లు కొని, రెండ్రూపాయల టికెట్టుతోనే సరిపెట్టుకుని థియేటర్లో ప్రవేశించాడు.

సినిమా ప్రారంభమైంది. హీరో హీరోయిన్లు పిచ్చి పిచ్చి పాటలు పాడుకుంటూ బ్రేక్‌డేన్సులు చేస్తున్నారు. ఇష్టం వచ్చినట్లు కిందా మీదా పడి పొర్లుతున్నారు. బూతు జోకులు జోకుకుంటున్నారు. పెళ్ళి కాకుండానే ఒకే మంచంమీద పడుకుని ఒకే దుప్పటి కప్పుకుంటున్నారు. వాళ్ళు మరీ ఒకరికొకరు దగ్గరగా వచ్చినప్పుడు డైరెక్టరుగారు ఒక పువ్వును వాళ్ళ ముఖాలకు చాటుగా పెడుతున్నారు. వాళ్ళిద్దరూ పొదలో దూరినప్పుడు ఆ పొద అదేపనిగా ఊగిపోతుంటే ప్రేక్షకులు ఏదేదో ఊహించుకుని మైకంలో ఊగిపోతూ హుషారుగా ఈలలు వేస్తున్నారు.

తల బద్దలుకొట్టుకున్నా ఆ పాటల్లో ఉన్న సాహిత్యం ఏమిటో దివాకరరావుకు ఆవగింజంత కూడా అర్థం కాలేదు. పోనీ కథకోసం చూద్దామంటే అదెక్కడా ఆ థియేటర్ చుట్టుపక్కల కూడా లేదు. మధ్య మధ్యలో రౌడీలు, ఫైట్లు, హీరోయిన్ కలలు, హీరోగారి కలలు, కలల్లో డ్యూయెట్లు, హెలికాప్టర్లు, మోటారు కార్లు, హీరో హెూండాలు, గుర్రాలు, పెద్దపులులు, ఒంటెలు, త్రాచుపాములు,

## మొదటి మహిళా గవర్నర్

మన దేశానికి మొదటి మహిళా గవర్నరు సరోజినీ నాయుడని మనందరికీ తెలుసు. అయితే ప్రపంచం మొదటి నారీ గర్నరుని నాలుగు వందల సంవత్సరాల ముందే చూసింది. 16వ శతాబ్దంలో స్పెయిన్ దేశస్థులు కొత్త భూఖండాల అన్వేషణలో అమిత శ్రద్ధ చూపుతుండే వారు. వీరిలో డిసోటో అనే సాహస యాత్రికుడు పశ్చిమ దిశగా పయనించి క్యూబా ద్వీపాన్ని కనుగొన్నాడు. ఈ తర్వాత వేరే భూభాగాలను అన్వేషించాలని బయలుదేరాడు. అయితే తాను కనుగొన్న క్యూబాను ఎవరి అధీనంలో ఉంచాలి? అందుకు తన భార్యను మించిన అర్హత వే రెవరూ కనిపించ లేదు. వెంటనే తన అర్థాంగి ఇసబెల్లాను క్యూబా దేశానికి గవర్నరెస్‌గా నియమించి యాత్రలకి బయలుదేరారు. ఈమే ప్రపంచంలో తొలి మహిళా గవర్నరు. ఈమె క్యూబాను 1539 నుంచి 1542 వరకు అంటే మూడేళ్ళపాటు ముచ్చటగా పాలించింది.

\- కె.ఆర్.కె. మోహన్



తారుడబ్బాలు, ఖాళీ అట్టపెట్టెలు అంత గందరగోళంగా ఉంది.

ఎలాగో సినిమా చూడటం పూర్తయిందనిపించి, బయటపడ్డాడు దివాకరరావు. ఈ సినిమా వరస చూశాక తన అమ్మా, నాన్నా మంచి సినిమా కోసం ఆంధ్రప్రదేశ్ విడిచి అమరలోకానికి ఎందుకు వెళ్ళిపోయారో అర్థమయ్యింది.

ఇంటి కంతల్లోంచి చల్లని వెన్నెల తను పక్కలా పరుచుకున్న చిరుగుల దుప్పటి మీద పడుతోంది. దీపం వెలిగించి సినిమా కథ రాయటానికి పూనుకున్నాడు దివాకరరావు. కథ పూర్తయ్యేసరికి తెల్లవారింది.

లేచి ముఖం కడుక్కుని కాస్తంత టీ పెట్టుకుని తాగి తాను రాసిన కథను మరోసారి చదువుకున్నాడు. అద్భుతంగా వచ్చింది. ఈ కథను సినిమాగా తీస్తే విజయం తథ్యం ! సరైన కథలు లేక అతుకుల బొంతల్లాంటి కథలతో అగచాట్లు పడుతున్న అభాగ్య నిర్మాతలకు ఈ కథ నిజంగా ఒక వరం. దీనిని సినిమాగా తీసి ఆ లక్షలను సలక్షణంగా అందుకోగలిగిన అదృష్టవంతుడు ఎక్కడున్నాడో ఏమో

కథను జాగ్రత్తగా చంకలో పెట్టుకుని నిర్మాతల వేటకు బయలుదేరాడు దివాకరరావు. చెప్పటం మరిచిపోయాను ! గతరాత్రి సినిమా చూడటానికే డబ్బులు తక్కువైన దివాకరరావు ఎక్కడికైనా ఎలా వెళ్ళాడు? ఆర్టీసీ వాళ్ళు వాళ్ళ చుట్టాలా, రైలుబళ్ళ వాళ్ళు అతనికి మేనమామలా, జట్కావాళ్ళు అతనికి రక్తసంబంధీకులా, టాక్సీవాళ్ళు వాళ్ళ సగోత్రీకులా అని అడుగుతారేమో? అదేం కాదు. దివాకరరావు అంతవరకూ తమ ఇంట్లో మూలపడి ఉన్న పాత ఇత్తడి గుండిగను కాస్తా అయనకాడికి అమ్మేశాడు. అమ్మేసి ఆ డబ్బుతో బస్సెక్కాడు. సరా !

** ** **

దివాకరరావు ఆ చుట్టుపక్కల పల్లెటూళ్ళలో కాస్తంత కలిగినవాళ్ళ అబ్బాయిలను కలిసి, వాళ్ళని కొబ్బరి తోటల్లోకీ, కాలవగట్లకీ లాక్కుపోయి తన చంకలో కథ తీసి తీరిగ్గా వినిపించాడు. ఈ కథను సినిమాగా తీస్తే కనకవర్షం కురుస్తుందనీ, అటుపైన రాజధాని వీధుల్లో ఖరీదైన కారుల్లో జామ్మని తిరగొచ్చనీ, హీరోయిన్ల పక్కనే వాళ్ళ భుజం తగుల్తూ అతి దగ్గరగా కూర్చోవచ్చనీ, అదనీ, ఇదనీ గాలి కొట్టాడు. కాని అతను కొట్టిన గాలి ఎవరికీ సరిగా ఎక్కలేదు. గాలి గాలిలోనే కలిసిపోయింది.

"మెడ్రాసులోనూ, అయిదరాబాదులోనూ కతలు రాసేవోళ్లు లేరేంటయ్యా? అసలు సినిమా అంటూ తీదలిస్తే అక్కడ కతలకి కరువేంలేదు. ఎల్లెల్లు" అంటూ తిప్పికొట్టారు కొందరు.

కథంత విన్నాక కొండంత సానుభూతి చూపించి, మజ్జిగ దాహం ఇచ్చి "ఎల్లిరా పిచ్చివంతులూ" అంటూ సాగనంపారు మరి కొందరు.

దివాకరరావు వలలో ఏ పిట్టా పడలేదు. ప్రజలు మరీ తెలివిమీరిపోయారు. నిరంజనరావు సలహా ఇలా నీరుకారిపోతుం దనుకోలేదు. చివరకు మరే దిక్కూ లేక కథను మడిచి చంకలో పెట్టుకుని దిబ్బలపాడు తిరిగొచ్చాడు దివాకరరావు.

** ** **



"ఒరేయ్ నిరంజనం !. నిరంజనం !"

"ఎవరూ?" తలుపు తీశాడు నిరంజనరావు.

ఎదురుగా దివాకరరావు ప్రత్యక్షమయ్యాడు. "ఏమిట్రా ఏమయ్యింది? కథ రాశావా !" కూర్చోమని కుర్చీ చూపిస్తూ అన్నాడు నిరంజనరావు.

"రాయకేం, రాశాను కథ అద్భుతంగా వచ్చింది. ను వ్వన్నట్లుగా ప్రొడ్యూసరు కోసం ప్రయత్నం చేశాను. కథ విన్నాక ఒక్కో వెధవకీ బుర్ర తిరిగిపోయింది. 'ఇంత మంచి కథను ఎలా రాయగలిగావయ్యా' అని మెచ్చుకుంటూ తెగ మురిసిపోయారు."

"ఇకనేం? అయితే నా ప్లాను ఫలించిందన్న మాట !"

"ఇదుగో చెబుతున్నాగా! సినిమా తీయటానికి ఇష్టపడ్డారు గాని నా కథ రేటు విషయంలోనే బేరం కుదిరి చావలేదు. ఒకడు అయిదు వేలిస్తాను అంటూ కథను కొట్టేసి, హైదరాబాదు చెక్కేద్దామనుకున్నాడు. నేను దానికి ససేమిరా ఒప్పుకోలేదు. మరొకడు పది వేలకు మించి పది పైసలు కూడా ఇవ్వనన్నాడు. నేను కనీసం పాతిక వేలు ఇవ్వాలనీ, సినిమా పూర్తయ్యే దాకా తనతో తిప్పుకోవాలనీ, సినిమా నిర్మాణ విషయంలో నా సలహాలు పాటించాలనీ, కండిషన్ పెట్టాను."

"అందుకు వా డే మన్నాడు?"

"పదిహేను వేల దాకా ఎక్కాడు. అటు పైన తన వల్ల కాదని తోక ముడి చేశాడు."

"పోనీ పదిహేను వేలంటే బాగానే వుందిగా. ఇచ్చెయ్యక పోయావూ?"

"అమ్మో! భలేవాడివే! రేపు ఈ సినిమా వంద రోజులూ ఆడి లక్షలు లక్షలు కురిస్తే అదంతా వాడే తీసుకుంటాడు. అప్పుడు అరిచి గీ పెట్టినా నాకు అదనంగా అయిదు పైసలు కూడా ఇవ్వడు. లాగే దేదో ముందే లాగాలి. అందుకే ఆ బేరం మనకి సరిపడదని ఇంటికి తిరిగొచ్చేశాను."

"అయితే ఇప్పు డేం చేస్తానంటావ్?"

"నేను రాసిన కథను అతి చౌకగా కొట్టేసి, దాని మీద వ్యాపారం చేసి ఎవడో ముక్కూ ముఖమూ తెలియని వెధవ లక్షలు లక్షలు సంపాదించటం నాకు ఎంత మాత్రం ఇష్టం లేదు. నాకు నాలుగు వేలు తక్కువ ముట్టచెప్పినా ఫరవాలేదు. అయినవాడవు, అప్పుడవు ఆ లాభాలు నువ్వు తింటేనే నాకు సంతోషం.

"అంటే ఏముంది? నీకు తోచినంత ఇచ్చి ఈ కథను నువ్వే తీసుకో. నీతో నేనూ వుంటాను. సినిమా నువ్వే తియ్యి! సినిమా సక్సెస్ అయ్యాక నీకు ధర్మం అనిపిస్తే నాకు మరో పాతిక వేలు ముట్టచెప్పు. అదీ నీకు ఇష్టమైతే సుమీ! అయినవాడవు, అనేకసార్లు నన్ను కష్టాల్లో ఆదుకున్న వాడివి నువ్వు! ఎవడో పరాయివాడి ఒళ్ళో ఈ లక్షలన్నీ పోయటం నాకు ఎంత మాత్రం ఇష్టం లేదు. నువ్వు బాగుంటే నేను బాగున్నట్లే."

"అదేమిట్రా నే నిప్పుడు పాతిక వేలు ఎక్కడ తేను?"

"నీ ఇష్టం అన్నానుగా! పాతిక వేలు కాకపోతే పదివేలు. పదికాక పోతే అయిదు. సరేనా! నీకు నాకూ మధ్య బేరా లేమిటి? ఛస్తే ఈ కథను మాత్రం మరో పరాయి వాడికి ఇచ్చి ఇటు స్నేహితుడికీ, అటు సరస్వతీదేవికీ అన్యాయం చేయలేను." బాధగా మూలిగాడు దివాకరరావు.

పాతిక వేలు చేసే కథ అయిదు వేలకే వస్తూందంటే ఇరవై వేలు ముందు గానే లాభం! సంబరపడుతూ కథను కొని కొబ్బరి తోట అమ్మి సినిమా తీయటం ప్రారంభించాడు నిరంజనరావు. పది రీళ్ళు పూర్తయ్యాక మాగాణీ అమ్మేశాడు. అటు పైన మెట్టభూమి అమ్మగా వచ్చిన దాంతో రీరికార్డింగు పూర్తి చేయించి రిలీజ్ చేశాడు ఈ బొమ్మని.

గోడకు కొట్టిన బంతిలా విడుదల అయిన మూడవ రోజునే పుట్టింటికి తిరిగి వచ్చింది పిక్చరు. లంకంత కొంప, వెంకలక్ష్మి, ఆమె తెచ్చిన భూమి, బంగారం మాత్రం మిగిలాయి.

"నువ్వు చెప్పినా ప్లాను ఇలా ఇంత దారుణంగా ఫెయిలవుతుందనుకోలేదు బ్రదర్. అయామ్ సో సారీ!" అంటూ నిరంజనరావుని హృదయానికి హత్తుకో బోయాడు దివాకరరావు.

"ఏదో చిన్ననాటి సహాధ్యాయుడివి గదా అని బ్రతుకు తెరువుకి సలహా యిస్తే, దానిని తెలివిగా నా మీదే ప్రయోగించి, మాయ మాటలు చెప్పి నా ఆస్తినంత తగలేయించావు. అయినా నువ్వు నన్ను నీ హృదయానికి హత్తుకోడానికి నే నింకా నీ అంత దీనస్థితికి దిగజార లేదు. నా ఆస్తి అంతా ఖర్చయిపోయినా ఇంకా నా భార్య ఆస్తి మిగిలి ఉంది. నువ్వు కలియుగ భస్మాసురుడివని, వరాలిచ్చిన వాడి తల మీదే చేతులు పెడతావని అనుకోలేదు. ఇటు పైన నీ చేతులు నీ తల మీదే పెట్టుకు భస్మాసురుడిలా భస్మం అయిపో! ఇటు పైన నాకు నీ ముఖం చూపించకు. గెటవుట్." చీదకరించుకుంటూ ముక్కు చీది ఇంట్లోకి వెళ్ళి ధడాల్న తలుపు మూసేశాడు నిరంజనరావు.

"నా చేతులు నా తల మీదే పెట్టుకున్నా భస్మ మవుతాననే భయం లేదు. ఎందుకంటే తగలేయటానికి నా దంటూ చిల్లి గవ్వ లేదు. నువ్విచ్చిన అయిదు వేలూ అప్పుడే అయిపోయాయి. ఇటు పైన మరో కథ రాసి, మరో బొమ్మ తీయించి మరో నిరంజనరావు ని. దిబ్బ చేయటం తప్ప నాకు మరో దారి లేదు." అనుకుంటూ తన చేతులు ఎవరి తల మీద పెట్టాలా అని నిర్మాత కోసం వెతుక్కుంటూ, కొత్త కథను ఆలోచించుకుంటూ, దిబ్బలపాడు విడిచి తూర్పు దిక్కుగా నడిచాడు దివాకరరావు. ★